# అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



**తల్లాడ,/ ఏప్రిల్ 11 (జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇళ్ల స్థలాలు కేటాయించాలని టిడిపి నాయకుడు నారపోగు ప్రసాద్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో శ్రీధర్ రాజుకు వినతిపత్రం అందజేశారు.మండలంలోని అనేక గ్రామాల్లో ఇల్లు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అర్హులను గుర్తించి పారదర్శకంగా ఇళ్ల కేటాయింపులు చేపట్టాలని, రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసే విధంగా సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు.

ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేయడానికి నిబంధనలు రూపొందించిందని, వాటి ప్రకారం అర్హులైన వారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రం అందజేసిన వారిలో నారపోగు ప్రసాద్ బాబు, రేగళ్ల శ్రీనివాసరావు, కాంపాటి రవి, ఇశ్రాయేలు తదితరులు ఉన్నారు.

# ఊట్కూరి అశోక్ మృతి బాధాకరం

## కుటుంబాన్ని పరామర్శించిన సిపిఐ నేతలు



**ఎల్కతుర్తి/ఏప్రిల్ 10, (జర్నలిస్ట్ వార్త):**మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన టీఆర్ఎస్ యువనేత ఊట్కూరి కార్తిక్ తండ్రి ఊట్కూరి అశోక్ గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు అన్నారు.అశోక్ మృతి వార్త తెలుసుకున్న వెంటనే ఉట్కూరి రాములు, జిల్లా దళిత హక్కుల పోరాట సమితి నాయకులు నిమ్మల మనోహర్, గోపాలపురం సర్పంచ్ కర్రే లక్ష్మీ బిక్షపతి తదితరులు మృతుడి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అశోక్ మృతి కమ్యూనిస్టు వర్గాలకు తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# బాల్య మిత్రునికి అండగా పూర్వ విద్యార్థులు

## రూ.18 వేల ఆర్థిక సహాయం



**వర్ధన్నపేట/ఏప్రిల్ 10(జర్నలిస్ట్ వార్త);**ఆపదలో ఉన్న బాల్య మిత్రుడిని ఆదుకునేందుకు మేమున్నామంటూ పూర్వ విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణానికి చెందిన చిరంజీవి (అలియాస్ చేరాలు) భార్య కేతమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషాదంతో ఆర్థికంగా, మానసిక ఇబ్బందుల్లో ఉన్న చేరాలు కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన స్నేహితులు నిర్ణయించుకున్నారు. వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలో 1987-88 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఏకమై, తమ వంతు సహాయంగా సేకరించిన రూ.18,000 నగదును శుక్రవారం బాధితుడికి అందజేశారు. దశాబ్దాలు గడిచినా స్నేహం విడిపోలేదని, కష్టాల్లో ఉన్న మిత్రుడికి అండగా నిలవడం తమ బాధ్యతని వారు పేర్కొన్నారు.

# కొప్పూర్‌లో మహనీయుల ఉత్సవ కమిటీ ఏకగ్రీవం



**భీమదేవరపల్లి/ఏప్రిల్10 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద శుక్రవారం మహనీయుల ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ సర్పంచ్ గద్ద కుమారస్వామి, ఉప సర్పంచ్ మిర్యాల రాణి-రాజు, రచ్చ సంపత్, కొమ్ముల రవీందర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్‌గా కొమ్ముల రాజు, ప్రధాన కార్యదర్శిగా కొమ్ముల నగేష్ ఎన్నికయ్యారు. కో-చైర్మన్లుగా గడిపే భిక్షపతి, గడిపే రాజేందర్, చుంచు రమేష్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా కొమ్ముల చంద్రమౌళి బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శులుగా గడిపే శ్రీకాంత్, కొమ్ముల బిలాయి ప్రసాద్, చుంచు శ్యామ్, గడిపే వంశీ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నల్లగొండ మురళి, తూముల వంశీ, దాట్ల రాజ్‌కుమార్, కదిరే సందీప్, బాకీ తిరుపతి, మంద లవణ్యలను ఎంపిక చేశారు. ఈ కమిటీ గ్రామంలో మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని సభ్యులు తెలిపారు.

# వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి..

## కుటుంబ సభ్యుల ధర్నా



**ఎల్కతుర్తి/ఏప్రిల్ 10, (జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని గోపాల్పూర్ గ్రామంలో వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. వివరాల ప్రకారం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బరిగల శోభ (45) రోజువారీ కూలీగా సీడ్ కంపెనీ పనులకు వెళ్లి తిరుగు ప్రయాణంలో మృతి చెందింది.శుక్రవారం ఎల్కతుర్తి మండలం కోతులనడుమ ప్రాంతంలో సీడ్ పనులు ముగించుకుని ట్రాక్టర్‌లో గ్రామానికి తిరిగి వస్తుండగా, ట్రాక్టర్ డబ్బాలోనే ఆమె అస్వస్థతకు గురై కుప్పకూలింది. వెంటనే గుర్తించిన సహచరులు స్పందించినప్పటికీ, అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిసింది.ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గోపాల్పూర్‌లో సీడ్ కంపెనీ యాజమాన్యం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు.సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై ప్రవీణ్ కుమార్, ఏఎస్ఐ శంకర్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు ధర్నాను విరమించారు.

శోభ మరణం పట్ల తోటి కార్మికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎప్పటిలాగే ముందుండి పనిచేసే శోభ ఆకస్మిక మృతి బాధాకరమని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న వేళల్లో కూలీలు, రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వడదెబ్బ నివారణకు తగిన దుస్తులు ధరించడం, తరచుగా విశ్రాంతి తీసుకోవడం, చెట్ల నీడలో ఉండడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అలాగే పొలాల్లో పనిచేసే సమయంలో విషపూరిత పురుగుల నుంచి రక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలని, పిచికారీ పనుల సమయంలో మాస్కులు, గ్లౌవ్స్ ఉపయోగించాలని సూచించారు.



# భక్తికి నిలువుటద్దం..

## సేవా గుణంలో సాటిలేని సుమన్ రావు

**కట్ట మైసమ్మ ఆలయ అభివృద్ధికి రూ. 5 లక్షల భారీ విరాళం**

**ఎంత ఖర్చయినా భరిస్తానని ఏ వన్ కాంట్రాక్టర్ హామీ**

**మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి సమక్షంలో ప్రకటన**

**దాతృత్వాన్ని కొనియాడిన పట్టణ ప్రజలు, రాజకీయ నేతలు**



**వర్ధన్నపేట/ఏప్రిల్ 10(జర్నలిస్ట్ వార్త);**
వర్ధన్నపేట పట్టణ ఆరాధ్య దైవం కట్ట మైసమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణానికి, ఆలయ పండుగ నిర్వహణకు ప్రముఖ ఏ వన్ కాంట్రాక్టర్ గుజ్జ సుమన్ రావు అభయహస్తం అందించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఆధ్వర్యంలోని బృందం సుమన్ రావును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తన వంతుగా రూ. 5 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించడమే కాకుండా, ఆలయ పనులకు భవిష్యత్తులో ఎంత ఖర్చయినా తానే స్వయంగా భరిస్తానని సుమన్ రావు భరోసా ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత తొలిసారి తన చాంబర్‌కు వచ్చిన పాలకుర్తి సారంగపాణిని, 11వ వార్డు కౌన్సిలర్ సిలువేరు కుమారస్వామిని గుజ్జ సుమన్ రావు శాలువాతో ఘనంగా సన్మానించారు. పట్టణ అభివృద్ధిలో యువ నాయకత్వం పోషిస్తున్న పాత్రను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. చైర్మన్‌ఆలయ అభివృద్ధి కోసం అడిగిన వెంటనే స్పందించి, ఇంత పెద్ద మొత్తంలో విరాళం ప్రకటించిన మొదటి వ్యక్తి గుజ్జ సుమన్ రావు అని చైర్మన్ పాలకుర్తి సారంగపాణి కొనియాడారు. ఊరిపై మమకారంతో సుమన్ రావు ఎన్నో సామాజిక కార్యక్రమాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఆయన సేవలు స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొండేటి సత్యం, కౌన్సిలర్ సిలివేరు కుమారస్వామి యాదవ్, సమ్మెట శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు తుమ్మల యాకయ్య, కాంగ్రెస్ నాయకులు ఎండి అఫ్సర్, అంబేద్కర్ జేఏసీ చైర్మన్ తుమ్మల శ్రీధర్, పూజారి రఘు, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు మైస వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

**హైదరాబాద్, ఏప్రిల్ 10(జర్నలిస్ట్ వార్త);**
కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ న ఇర్ణయం తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేదని అన్నారు. హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ..కమిషన్ల కోసమే ఇప్పుడు కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీలో తీవ్రమైన అవినీతి జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు నష్టం చేయవద్దని కోరారు. అలాగే జీహెచ్ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. అనేక గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో



1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు. నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక కూడా కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఆరోపణలు చేసిన రేవంత్ దీనిని ఎలా కొనసాగిస్తారని అన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు. నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు.


మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని.. ప్రజలు ఆయన్ను ఎప్పుడో మర్చిపోయారని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను... ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను' అని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

# కాంగ్రెస్ సర్కార్‌పై విపక్షాల విమర్శలు హాస్యస్పదం

**మహిళా నేత నరుకుడు ఎలీషా -ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి పాలన**

**విద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు -పేరెంటల్ సపోర్టు చట్టం వృద్ధులకు కొండంత అండ**

**వర్ధన్నపేట/ఏప్రిల్ 10(జర్నలిస్ట్ వార్త);** తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలపై బిజెపి, బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యస్పదంగా ఉన్నాయని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య సతీమణి, మహిళా నాయకురాలు నరుకుడు ఎలీషా మండిపడ్డారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.పిల్లల చదువు ,తెలంగాణ భవిష్యత్తు అనే నినాదంతో విద్యా రంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెచ్చిందని ఆమె పేర్కొన్నారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు 25 రకాల వస్తువులతో కూడిన కిట్లు, అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల



ఏర్పాటు ఒక చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే పిల్లల నుంచి వారికి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం పేరెంటల్ సపోర్టు చట్టం 2026 తీసుకువచ్చిందని ఎలీషా వివరించారు. పిల్లలు పోషించకుంటే వృద్ధులు నేరుగా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. 60 రోజుల్లోపు సమస్య పరిష్కారమవుతుంది. సంపాదనలో 15 శాతం లేదా నెలకు రూ. 10 వేల వరకు ప్రభుత్వం రికవరీ చేసి తల్లిదండ్రులకు అందిస్తుంది అని ఆమె తెలిపారు. గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి అని భయపెడితే, నేడు రేవంత్ సర్కార్ సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ చెల్లిస్తోందని గుర్తు చేశారు. మక్కలకు రూ. 2,400 మద్దతు ధర కల్పిస్తూ రైతన్నకు అండగా నిలుస్తోందని చెప్పారు. ఇప్పటికే 60 వేల ఉద్యోగాల కల్పనతో యువతలో నమ్మకం నింపిన ఈ ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక విపక్షాలు అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో రాష్ట్ర ఖజానాను దోచుకున్న బిఆర్ఎస్, ఏడాదికి కోటి ఉద్యోగాలు, జనధన్ ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామన్న హామీలను విస్మరించిన బిజెపి. ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న ఈ పాలనకు ప్రజల మద్దతు మెండుగా ఉందని ఎలీషా స్పష్టం చేశారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**రైతులకు మద్దతు ధరతో ఆదుకుంటాం: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**





**నర్సంపేట,/ ఏప్రిల్ 10 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్‌తో పాటు మొక్కజొన్నకు కనీస మద్దతు ధరగా క్వింటాల్‌కు రూ.2400 అందిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో కూడా ఉచిత విద్యుత్ రైతులకు ఎంతో మేలు చేసిందని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటలను విక్రయించుకునేలా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, మధ్యవర్తుల సమస్యలు లేకుండా నేరుగా రైతులకు లాభం చేకూరే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వేముల సాంబయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సిద్దెన రమేష్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, సర్పంచ్ కంది శ్వేత కృష్ణచైతన్య రెడ్డి, గోపాల్ నాయక్, ఆవుల రాములు, తప్పెట రమేష్, బండి హరీష్, గూడా మహేందర్, మైదా రాకేష్, భూక్యా హనుమ నాయక్, భాస్కర్, హంస విజయరామరాజు, మహేందర్ రెడ్డి, మచ్చిక రాంబాబు, చాపలా మధుకర్, మేండే విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మాణిక్యాపూర్‌లో బడిబాట నమోదు కార్యక్రమం ప్రారంభం





**భీమదేవరపల్లి/ఏప్రిల్10 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని మాణిక్యాపూర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2026 27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ప్రత్యేక నమోదు కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, ప్రజా ప్రతినిధులు, యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు భారీ ర్యాలీగా గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక వసతులు, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం, ఏకరూప దుస్తులు, డిజిటల్ తరగతులు, విద్యా అనుబంధ కార్యక్రమాల గురించి ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు వివరించారు. గ్రామంలోని విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లోనే నమోదు చేసుకునేలా చొరవ తీసుకోవాలని కోరారు.అలాగే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సంబంధించి తల్లిదండ్రుల నుండి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ కార్యక్రమం జూన్ 12వ తేదీ వరకు కొనసాగుతుందని, 100 శాతం నమోదు లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని విద్యాభిమానులను, తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


# దళిత బహుజనుల కోసం పోరాడిన ప్రభాకర్‌కు ఘన నివాళి

**ప్రభాకర్ ఆశయాలను కొనసాగిస్తాం: నాయకులు**

**భీమదేవరపల్లి/ఏప్రిల్10 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం బహుజన నాయకుడు చెప్యాల ప్రభాకర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, దళిత-బహుజన సంఘాల ప్రతినిధులు, అంబేద్కర్ వాదులు, తెలంగాణ ఉద్యమ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ చెప్యాల ప్రభాకర్ తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గొప్ప నాయకుడని గుర్తుచేశారు. రైలురోకోలు, ధర్నాలు, రాస్తారోకోలు, ధూమ్‌ధామ్ కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యాలయాల ముట్టడులు, ప్రజా సమస్యలపై ఆందోళనలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారని తెలిపారు. బీఎస్పీ




పార్టీలో పనిచేస్తూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా, హుజురాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారని పేర్కొన్నారు. అనంతరం ముల్కనూర్‌లోని సుధాకర్ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రభాకర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని, ఆయన భౌతికంగా దూరమైనా ఆలోచనలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయని నాయకులు వెల్లడించారు. ఈ



కార్యక్రమంలో జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గ చైర్మన్ కవ్వా లక్ష్మారెడ్డి, డాక్టర్ సుధాకర్, మాజీ జడ్పిటిసి వంగ రవీందర్, జేఏసీ చైర్మన్ డి. సారయ్య, ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ, దార్న శ్రీనివాస్, అప్పని బిక్షపతి, డాక్టర్ తిరుపతి, మాడుగుల కొమురయ్య, చెప్యాల ప్రకాష్, చెప్యాల మాయావతి, మారుపాటి మహేందర్ రెడ్డి, గజ్జల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి వార్డు సభ్యులే బలమైన స్తంభాలు: ఎంపీడీవో



**తల్లాడ/, ఏప్రిల్ 11 (జర్నలిస్ట్ వార్త):** గ్రామాల సమగ్ర అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని ఎంపీడీవో అంబటి శ్రీధర్ రాజు పేర్కొన్నారు. తల్లాడ రైతు వేదికలో నిర్వహించిన రెండవ విడత వార్డు సభ్యుల శిక్షణ తరగతులు శనివారం ఘనంగా ముగిశాయి.ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో, శిక్షణ పూర్తి చేసిన సభ్యులకు పర్యావరణ హితమైన జ్యూట్ బ్యాగులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి దిశగా ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో వార్డు సభ్యులు కీలక భూమిక పోషించాలని సూచించారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో వినియోగించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని పిలుపునిచ్చారు.9 గ్రామాలకు చెందిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిక్షణ తరగతులను విజయవంతంగా నిర్వహించిన శిక్షకులను, ఉత్సాహంగా పాల్గొన్న సభ్యులను ఎంపీడీవో అభినందించారు.గ్రామీణ పరిపాలనలో నాణ్యతను పెంపొందించే దిశగా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పాల్గొన్న వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# మృతురాలి కుటుంబానికి అండగా ఉంటా

**: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి -మహేశ్వరి మృతదేహానికి నివాళి**



**రాయపర్తి/, ఏప్రిల్ 10: (జర్నలిస్ట్ వార్త)** మండలంలోని ఏకే తండా గ్రామానికి చెందిన గుగులోత్ పూల్యారజిత దంపతుల కుమార్తె మహేశ్వరి (చిట్టి) అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన కలకలం రేపింది. ఈ నేపథ్యంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె, మహేశ్వరి మృతి కుటుంబానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మృతికి కారణమైన వారిని వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని సూచించారు.మృతురాలి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్, నాయకులు రెంతాల గోవర్ధన్ రెడ్డి, పాల్వంచ కోటేశ్వరరావు, కాంచనపల్లి వనజారాణి, సుదర్శన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ



**రాయపర్తి/, ఏప్రిల్ 10:( జర్నలిస్ట్ వార్త)** మండలంలోని శివరామపురం గ్రామ పరిధిలోని సుభాష్ తండాకు చెందిన లకావత్ మంగమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. ఈ నేపథ్యంలో శుక్రవారం బాధిత కుటుంబానికి బియ్యం అందజేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ శీలా హేమలత రత్నాకర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం అందించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూక్యా లక్ష్మణ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాయితోజు ఉపేందర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# యాకమ్మ మృతికి బీఆర్ఎస్ నాయకుల నివాళి

**రాయపర్తి/, ఏప్రిల్ 10( జర్నలిస్ట్ వార్త):** మండలంలోని కోలన్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ వంగాల యాకమ్మ గుండెపోటుతో ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన దశదిన కర్మలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు.అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహా నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, సోషల్ మీడియా అధ్యక్షుడు అశ్రఫ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

